క్లుప్తంగా

రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్న కూటమిని ఓడించండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎస్సీ వర్గీకరణ ద్వారా దళితుల్లో విభజన తీసుకొచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని కుట్ర పన్నుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని మాలలు ఎన్నికల్లో ఓడించి బుద్ధిచెప్పాలని పి.వి.రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఎస్సీ వర్గీకరణకు పలు రాష్ట్రాలు వ్యతిరేకంగా ఉన్నాయని, కానీ రాజ్యాంగ వ్యతిరేకమైన, సుప్రీంకోర్టు కొట్టివేసిన వర్గీకరణకు చంద్రబాబు మద్దతిస్తూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 70 లక్షల మంది మాలలు, 10 లక్షల మంది దళిత క్రైస్తవులు కూటమికి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు. మరోవైపు బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేసి దళితుల రిజర్వేషన్లను, ఎస్సీ రిజర్వుడు స్థానాలను తీసేస్తామని మాట్లాడుతుండటం దారుణమన్నారు. పి.వి.రావు మాల మహానాడు ఏపీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, లచ్చిమల్ల నరసింహారావు, జాతీయ ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

బంటుమిల్లి: ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉపాల రమేష్ (రాము), మచిలీపట్నము పార్లమెంటు అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులను అత్యధిక మెజారిటీ గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము సోదరి అనురాధలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగారు.

పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండండి

పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన: పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన పనిని బాధ్యతగా నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. వెంకటరమణ అన్నారు. నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో పెడన నియోజకవర్గానికి కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులకు (పీవో), సహాయ ప్రిసైడింగ్ (ఏపీవో) అధికారులకు పోలింగ్ విధులపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈఆర్వో వెంకటరమణ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించడానికి పీవో,ఏపీవో, ఇతర పోలింగ్ సిబ్బందికి సమన్వయం ఉండాలన్నారు. పీవోలు, ఏపీవోలకు అప్పగించిన పనిని ఇతర పోలింగ్ సిబ్బందికి అప్పగించకుండా ఎవరి పనులు వారు నిర్వహించాలని స్పష్టం చేశారు. 94ఎ సెక్షన్



పీవో, ఏపీవోలకు దిశానిర్దేశం చేస్తున్న పెడన ఈఆర్వో వెంకటరమణ

ఓటు, ఛాలెంజింగ్ ఓట్లు వచ్చినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ సామగ్రికి సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నాయా, అందాయా లేదా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా తప్పు జరిగినా తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ సామగ్రితో పాటు పోలింగ్ స్టేషన్‌కు తరలివెళ్లాలని, అక్కడే స్టే చేయాల్సి ఉంటుందన్నారు. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు విందు, బస ఏర్పాటు చేస్తామన్నా వాటి జోలికి పోవద్దని స్పష్టం చేశారు. బంధువుల ఇంటికి వెళ్లొద్దన్నారు. పోలింగ్ కేంద్రంలో ఉండాలని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయమే మాక్ పోల్ ఉంటుందని, మాక్ పోల్ పూర్తయిన తరువాత ఈ పీవోలు, ఏపీవోలు బ్యాలెట్ యూనిట్‌ను క్లియర్ చేయాలన్నారు. ఏఈఆర్వో కె రాంబాబు, డిప్యూటీ తహసీల్దారు పూర్ణచంద్రరావు, ఎన్నికల విభాగం డీటీ కల్పన ఓపీవోలు (అదర్ పోలింగ్ అధికారులు) పాల్గొన్నారు. ఈ శిక్షణ కేంద్రాన్ని మచిలీపట్నం పార్లమెంటు వ్యయ పరిశీలకులు జాన్ కింగ్‌స్లే, పెడన అసెంబ్లీ వ్యయ పరిశీలకులు అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం

మచిలీపట్నంటౌన్: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో బుధవారం అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ఎస్ బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈఅన్నదానాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఆశాలత ప్రారంభించారు. వైద్యురాలు గీతావాణి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ రాష్ట్రనాయకులు కొత్తగుండు రమేష్ అన్నదానం, మజ్జిగను ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు నిరంజనరావు, రామచంద్రరావు, పాండురంగారావు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

మర్రిపాలెం(నాగాయలంక): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, సంస్థ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి నాగాయలంక సబ్ బ్రాంచి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. మర్రిపాలెం డొంక రోడ్డు పక్కన నివశిస్తున్న 25 ఎస్టీ కుటుంబాలకు దోమతెరలు బ్రాంచి చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో అందజేశారు. కిరాణా మర్చంట్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు మునగాల కుటుంబరావు ఆర్థిక సహాయంతో దోమతెరలు సమకూర్చారు. లేబాక నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు , చిట్టా వెంకట శేఖర్, బండ్రెడ్డి శ్రీనివాసరావు, లీలాకృష్ణ, కరుణాకర్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

1,293 మద్యం సీసాలు స్వాధీనం

కోనేరుసెంటర్: బందరు సబ్ డివిజన్ పరిధిలోని మచిలీపట్నం గూడూరు మండలాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా నిర్మించిన మద్యం సీసాలను పట్టుకునేందుకు జరిపిన ఈ దాడుల్లో గూడూరు మండలంలో ఓ వ్యక్తి మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న సెబ్ సీఐ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 543 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మద్యం సీసాలను రహస్యంగా దాచిపెట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించారు. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తిని టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకుని అతని వద్ద నుంచి 750 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



ఘంటసాలపాలెం(ఘంటసాల): వైఎస్సార్ సీపీ నేత దోనె వెంకటేశ్వరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. గత సోమవారం జరిగిన ఎమ్మెల్యే రమేష్ బాబు మేం సిద్ధం రోడ్ షో నిర్వహించగా ర్యాలీలో పాల్గొన్న బైక్ ప్రమాదవశాత్తు పడిపోవడంతో వెంకటేశ్వరరావు గాయాలపాలయ్యారు. వెంటనే విజయవాడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చిన వెంకటేశ్వరరావును, ఆయన సతీమణి దోనె రజనీని స్థానిక నేతలతో కలసి ఎమ్మెల్యే పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వి.వెంకట్రావు, జేసీఎస్ కన్వీనర్ వి.ప్రవీణ్, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నాపైన ఎల్లయ్య మృతదేహం లభ్యం

జగ్గయ్యపేట: కిడ్నాప్‌నకు గురైన తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా సైనికపురి కాలనీకి చెందిన వడ్డె ఎల్లయ్య (58) మృతదేహాన్ని బుధవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామం అటవీ ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. గత నెల 19న జగ్గయ్యపేటలో ఎల్లయ్యను కిడ్నాప్ చేశారంటూ అతని సోదరుడు సతీష్ ఫిర్యాదు చేశారు. స్థానిక సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. స్థానికుడు తాడోజు శ్రీకాంత్‌రాజు(చారి)తో మరి కొంతమంది సాయంతో.. జగ్గయ్యపేటలో భార్యాభర్తల గొడవ ఉందనిఎల్లయ్యను తీసుకువచ్చి అక్కడ ఓ ఇంట్లో హత్య చేసి మృతదేహాన్ని కనిపించకుండా చేసినట్లు బయటపడింది. ఈ నెల రెండో తేదీన శ్రీకాంతరాజు పోలీసులకు చెప్పిన వివరాల ప్రకారం దర్యాప్తు చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం

ఎల్లయ్య మృతదేహం కోసం శ్రీకాంత్ రాజుకు సహకరించిన వారిని కొన్ని రోజులుగా పోలీసులు విచారణ చేస్తుండటంతో బుధవారం మండలంలో బండిపాలెం గ్రామంలోని అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని కాల్చిపూడ్చి పెట్టినట్లు చెప్పడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. అతని శరీరం మీద ఉన్న వస్తువుల ఆధారంగా భార్య యాదమ్మ ఆ మృతదేహాన్ని తన భర్తదిగా గుర్తించింది. ప్రభుత్వాసుపత్రి వైద్యులు తహసీల్దార్ శేషగిరి సమక్షంలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు ఎల్లయ్యపై పలు హత్య కేసులు నమోదయ్యాయి.

సుపారీ ఇచ్చి హత్య చేశారు!

సుపారీ ఇచ్చి తన తండ్రిని హత్య చేశారని ఎల్లయ్య కుమార్తె అమల భోరున విలపించారు. తన తండ్రిని రాజకీయంగా ఎదుర్కోలేక తాడోజు శ్రీకాంత్‌రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్య, బొడ్డు కిరణ్, చింతలపాటి మధు, నిర్మల, వాణిశ్రీ హత్య చేయించారని ఆరోపించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

మచిలీపట్నంటౌన్:వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు నగరంలో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అభ్యర్థుల వివరాలు, గుర్తులతో ఉన్న కరపత్రాలను అందజేసి నమూనా ఈవీఎం ప్యాడ్‌పై ఓటు వేసే విధానాన్ని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలు రద్దు కాకుండా అమలు జరగాలంటే మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన అమలు సాధ్యంకాని హామీలు నమ్మి ఓట్లు వేస్తే 2014లో జరిగిన విధంగానే ప్రజలకు ఏ సంక్షేమ పథకం అందదన్నారు. ప్రతి ఓటరు విజ్ఞతతో ఆలోచించి బందరు అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తనయుడు పేర్ని కిట్టు కు, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులకు ఓటు వేయాలని కోరారు.

నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా పోలింగ్ విధులు

ఉంగుటూరు: ఎన్నికల్లో నిష్పక్షపాతంగా, బాధ్యతయుతంగా పోలింగ్ విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పీవోలు, ఏపీవోలకు సూచించారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియామవళి హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. అలా చేస్తే నిబంధనల్లో పొరపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహిస్తారన్నారు. రిసెప్షన్ సెంటర్‌కు సకాలంలో హాజరు కావాలని, సహేతుక కారణం ఉంటేనే మినహాయింపు ఇస్తారని చెప్పారు. పొరపాటు జరిగితే అనవసర ఆందోళనకు గురికాకుండా నిజాయతీగా రిపోర్టు చేయాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు ఏఏ రిపోర్టులు, ఎప్పుడెప్పుడు ఏఏ ఫారాల్లో ఇవ్వాలి అనే విషయాలపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఫారంలో కాలమ్స్ చదువుకుని సరైన సమాచారంతో నింపి సకాలంలో కచ్చితమైన రిపోర్టులు ఇవ్వాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్-వీవీ ప్యాట్-కంట్రోల్ యూనిట్లను కనెక్ట్ చేయడంలో సరైన అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, బాపులపాడు తాహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పీవో, ఏపీవోల సందేహాలను నివృత్తి చేస్తున్న కలెక్టర్ బాలాజీ

అధికారుల పాత్ర కీలకం

గుడివాడ టౌన్: సాధారణ ఎన్నికల పోలింగ్‌లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ అధికారుల పాత్ర కీలకమైనదని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పోలింగ్ ముందు రోజే రిసెప్షన్ కౌంటర్‌కు సకాలంలో చేరుకోవాలన్నారు. ఆలస్యంగా వస్తే షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. దివ్యాంగులు, గర్భిణులు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న వారు మినహా మిగిలిన వారంతా సాధారణ ఓటర్లుగానే గుర్తించి వారికి ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి పి. పద్మావతి, ఇతర అధికారులు, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

జగన్‌ను గెలిపించేందుకు నాయీ బ్రాహ్మణులు సిద్ధం

నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రాకర్ల వేణుబాబు

పామర్రు: ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణుల పూర్తి మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికే అని ఆయన్ని మళ్లీ సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రాకర్ల వేణుబాబు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పామర్రులోని వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించడమే కాకుండా సమాజంలో గుర్తింపు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారన్నారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ పదవి ఇవ్వడమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి దేవాలయంలో నాయీ బ్రాహ్మణులకు గౌరవం ఇచ్చే విధంగా జీవో నం. 50ను విడుదల చేసి సామాజిక భద్రతను కల్పిస్తూ మా గౌరవాన్ని పెంచారన్నారు. దేవాలయాల్లో క్షరకులను ఎండోమెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ కనీస వేతనం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్, మార్కెట్ యార్డు చైర్మన్‌లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీ ఇలా అనేక నామినేటెడ్ పదవుల్లో నాయీ బ్రాహ్మణులకు జగన్ ఎన్నో అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు.

రానున్న ఎన్నికల్లో చంద్రబాబు తోకను కత్తిరిస్తాం..

గతంలో చంద్రబాబు నాయీ బ్రాహ్మణులను ఉద్దేశించి తోకలు కత్తిరిస్తామని అనుచిత వ్యాఖ్యలు చేశారని దీనికి ప్రతి నాయీ బ్రాహ్మణుడు రానున్న ఎన్నికల్లో బాబు తోకను కత్తిరించడానికి సిద్ధంగా ఉన్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రవేశపెట్టింది మానిఫెస్టో కాదు, మనీ ఫెస్టో అని ఇది ఆమోద యోగ్యం కాకపోవడంతో పీఎం మోదీ దాన్ని అంగీకరించలేదని పేర్కొన్నారు. బీసీలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావును, పామర్రు అసెంబ్లీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని, దానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కోరిమిల్లి నాగమురళి, బయవరపు దుర్గా ప్రసాద్, అముదాలపల్లి సుబ్రమణ్యం, పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పార్టీ కరపత్రాలను చూపుతున్న సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేణుబాబు

క్వారీ గుంతలో పడి అక్కాచెల్లెళ్లు మృతి



దొనబండ రాతి క్వారీ గుంతలో పడి మరణించిన లక్ష్మీజాని, జానీరాధ (అక్కా చెల్లెళ్లు)



దొనబండ రాతి క్వారీలో ఇద్దరు చిన్నారులను బలి తీసుకున్న నీటి గుంత

- దుస్తులు ఉతకడానికి వెళ్లి..
- దొనబండ క్వారీ ప్రాంతంలో విషాద ఛాయలు

దొనబండ(కంచికచర్ల): క్వారీ గుంతలోని నిల్వ ఉన్న నీటిలో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన అక్కాచెల్లెళ్లు జారిపడి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన బుధవారం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్ఐ మహాలక్ష్ముడు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన లీవన్ దంపతులు 15 ఏళ్ల క్రితం దొనబండ క్వారీలో కూలి పనులు చేసేందుకు వచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లీవన్ లక్ష్మీజాని(11), చిన్న కుమార్తె జానీరాధ(10) పరిటాల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 9, 8 తరగతులు చదువుతున్నారు. తల్లిదండ్రులు పని చేసే క్వారీ క్రషర్ సమీపంలో ఓ పెద్ద గుంతలో నీరు నిల్వ ఉంది. దానిలో దుస్తులు ఉతికేందుకు బుధవారం కుమార్తెలిద్దరూ వెళ్లారు.

కాలుజారి నీటిలో పడి.

జానీరాధ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడింది. ఆమెను కాపాడేందుకు లీవన్ లక్ష్మీజాని నీటిలో దిగింది. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోతున్న ఇద్దరు పిల్లలను సమీపంలో ఉన్న లారీ డ్రైవర్లు చూశారు. వారిని కాపాడేందుకు నీటిలో దిగారు. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈలోగా అక్కడున్న వారు నీటిలో మునిగిపోయిన చిన్నారులను బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు. బిడ్డల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండె లవిసేలా రోదించారు. ఘటనతో దొనబండ క్వారీ పరిసర ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. పంచనామా కోసం చిన్నారుల మృతదేహాలను నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే సింహాద్రి సతీమణి ప్రచారం

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సతీమణి కెప్టెన్ లక్ష్మి బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని గొడపాలెం, పాతకోట, వసుమట్ల, పల్లెపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కెప్టెన్ లక్ష్మితో పాటు ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్ ఇంటింటా తిరిగి పార్టీ మేనిఫెస్టో ప్రతులను అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరించి బందరు పార్లమెంట్‌కు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, అసెంబ్లీకి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుని గెలిపించాలని కోరారు. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, మండల అధ్యక్షుడు కాకి నాగేశ్వరరావు, బూత్ కన్వీనర్ బుర్ర రామకృష్ణ, బీసీ సెల్ నాయకుడు నాయుడు శ్రీనివాసరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సామర్ల మల్లిఖార్జునరావు, నాయకులు తుంగల అంకారావు, జంపాన మురళి, నాయకులు పాల్గొన్నారు.



పులిగడ్డలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి సతీమణి కెప్టెన్ లక్ష్మి

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న ఉభయదాతలు, భక్తులు

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ లక్ష్మీగణపతి హోమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్థానిక ఉల్లివారివైపు ఉన్న సిద్ధిబుద్ధి సమేత ప్రసన్న గణపతి దేవాలయ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువపందిళ్ల కింద లక్ష్మీగణపతి హోమం జరిపారు. కోడూరుకు చెందిన కంచర్లపల్లి లీలాశ్రీనివాస్-నాగలక్ష్మీ, తూనుగుంట్ల వెంకట మహేష్- శిరిష్మా, కోట నాగపోతురాజు-ప్రియాంక, అడుసుమల్లి సత్యన్నారాయణ- ఆదిలక్ష్మీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి హోమాన్ని నిర్వహించారు. హోమం అనంతరం మహాపూర్ణాహుతిని కనులపండువగా జరిపారు. వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి విశేష అలంకారం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆరు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

పాలిసెట్‌లో విక్రాంత్‌కు స్టేట్ 195వ ర్యాంక్

చల్లపల్లి: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కుమ్మరగుంట విక్రాంత్ రాష్ట్ర స్థాయిలో 195వ ర్యాంక్ సాధించాడు. ఎలాంటి శిక్షణ పొందకుండా విక్రాంత్ కష్టపడి చదివి ఇంజినీరింగ్ విద్య అభ్యసించాలనే తన లక్ష్య సాధనలో మొదటి అడుగు వేశాడు. ఆటో నడుపుకుని జీవించే జగన్మోహనరావు-సురేఖ దంపతుల కుమారుడు మంచి ర్యాంకు సాధించటంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



అక్రమంగా నిల్వ చేసిన మద్యం పట్టివేత



నందిగామ ఎస్ఈబీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న మద్యం

నందిగామ: అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను బుధవారం నందిగామ ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో తెలంగాణకు చెందిన 200 కేసుల (9,600) మద్యం సీసాలు నిల్వ చేశారు. దాని విలువ రూ.12.48 లక్షలు ఉంటుందని ఎస్ఈబీ అధికారులు తెలిపారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అదుపులోకి తీసుకొని మద్యం ఎక్కడి నుంచి తెచ్చారు.. ఎవరు తీసుకొచ్చారు.. అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.

ఘంటసాల: మద్యం అక్రమంగా నిల్వచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మొవ్వ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వి.శివరామరాజు అన్నారు. ఘంటసాల మండలం పూషడంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్నారని సీఐ శివరామరాజుకు విశ్వసనీయ సమాచారం అందింది. అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ కృష్ణా జిల్లా ఈఎస్ జి.గంగాధరరావు, ఏఈఎస్ జి.పాండురంగారావు పర్యవేక్షణలో బుధవారం ఎస్ఈబీ సిబ్బంది దాడి చేశారు. ఆరు కేసులు 180మి.లీ. పరిమాణం కలిగిన రూ.42,400 విలువైన 288 మద్యం సీసాలు కలిగిన మూడు మూటలను స్వాధీనం చేసుకుని విక్రయదారుడైన భీమ వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. అతన్ని మొవ్వ జెఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ ముందు హాజరుపర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో వీఆర్వో తోట రవికుమార్, ఎస్ఈబీ స్టేషన్ ఎస్ఐ పి.హేమసుస్మిత, హెచ్‌సీ పి.రంగబాబు, సిబ్బంది రాజ్‌కుమార్, అహ్మద్, గోపీనాథ్, ఎక్సైజ్ ఎస్ఐ ఎస్‌కే సుభాని, హెచ్‌సీ డి.రామకృష్ణ పాల్గొన్నారు.



పూషడంలో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

క్లుప్తంగా

మృతుడి కార్నియాల సేకరణ



నాగాయలంక: గ్రామంలోని 1వ వార్డులో మంగళ వారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధుడు ఆలూరి వెంకటేశ్వరరావు(72) నేత్రాలను పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి దానం చేశారు. మృతుడి భార్య సామ్రాజ్యం, కుమారుడు ఆలూరి శ్రీనివాసరావు, కుమార్తెలు సబ్బినేని సుజాత–శ్రీనివాసరావు, ఉప్పల సునీత–సురేష్ స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకొచ్చారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ లకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ అరుణ్ బృందం మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 204కు చేరాయని రఘుశేఖర్ వెల్లడించారు. ఆలూరి వెంకటేశ్వరరావు భౌతికాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు బుధవారం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేత్రదానాలను ప్రోత్సహిస్తున్న సుదర్శి సంస్థ రఘుశేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ప్రజలకు మంచి జరగాలంటే సీఎంగా జగన్ మళ్లీ ఉండాలి



కోడూరు: వైఎస్సార్ సీపీకి చెందిన స్టార్ క్యాంపెనర్లు తీరప్రాంత గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ నియమించిన ఐదుగురు క్యాంపెనర్లు పండలనేని శివప్రసాద్, సొడాబత్తిన పూర్ణచంద్రరరావు, నుకల లక్ష్మయ్య, గోవాడ మోహనరావు, మాతంగి సర్వేష్‌కుమార్‌లు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. మండలంలో హంసలదీవి, పాలకాయతిప్ప, ఉల్లిపాలెం కోడూరు, రామకృష్ణాపురం, ఇరాలి, ఊటగుండం, బసవానిపాలెం గ్రామాల్లో పర్యటించి, అక్కడ ఓటర్లను చైతన్యపర్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచి, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు మళ్లీ మంచి జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలన్నారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబును, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించి, రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని స్టార్ క్యాంపెనర్లు కోరారు. గ్రామ పార్టీ నేతలు పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా నిలవాలి



కొడాలి(ఘంటసాల): అక్క చెల్లెమ్మల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నకు మనందరం తోడుగా నిలవాల్సిన సమయం వచ్చిందని ఘంటసాల మార్కెట్ కమిటీ ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చంద్ర అన్నారు. కొడాలి గ్రామంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు కొడాలి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించి అక్క చెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, మన బిడ్డలకు అన్ని విధాల అండగా నిలిచిన జగనన్నకు మనందరం ఓటు ద్వారా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. మన కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబుకు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులకు రెండు ఓట్లు సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎంపీటీసీ కొండేటి నీలవేణి, పీఏసీఎస్ చైర్మన్ తాతినేని కృష్ణారావు, పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కుంపటి శరత్ బాబు, నేతలు తుమ్మల సురేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు తుమ్మల రాజా, వార్డు సభ్యులు వి.రాఘవులు, రాఘవమ్మ, కొడాలి యేసుపాదం, వెంకటేశ్వరరావు, కె.సురేష్, జి.చిన్నాయన, సీహెచ్.రాజయ్య, శంకర్, నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలుద్దాం

గూడూరులో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక విస్తృత ప్రచారం



లేళ్లగరువులో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

గూడూరు: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పాలనకు అందరం అండగా నిలుద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రాముకు మద్దతుగా బుధవారం గూడూరు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని రామానుజవత్తర్లపల్లి, లేళ్లగరువు, షా అబ్దుల్లాపాలెం, జక్కంచర్ల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 59 నెలల జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాల వారందరికీ ఎంతో మేలు జరిగిందన్నారు. పారదర్శక పాలనతో జగనన్న ప్రజల హృదయాలను గెలుచుకున్నారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంతగా శ్రమించిన దాఖలాలు లేవన్నారు. తన పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల భవిష్యత్‌ను, పథకాలను కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలన్నారు. జగనన్నకు ఓటు వేస్తే పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రజలను మధ్య పెట్టకుండా రానున్న ఐదేళ్లలో చేయగలిగిన హామీలను మాత్రమే జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చారన్నారు. భూటకపు వాగ్దానాలు చేసి, ప్రజలను నమ్మించి మోసం చేయడం జగనన్న నైజం కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.మధుసూదనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.శ్రీకుమార్, పార్టీ అధ్యక్షుడు పర్లం పెదబాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎం.వి.వెంకటేశ్వరరావు, మట్టా గుర్నాథం, ధనేష్, వెంకటప్పయ్య, ఆత్మూరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను..



పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)కు హారతి ఇస్తున్న మహిళ

పెడన: మీ నమ్మకాన్ని ఒమ్ము చేయను..నన్ను నమ్మి ఆశీర్వదించండి..మీ అబ్బాయిగా...మీ ఇంటి బిడ్డగా నమ్మి ఓటేయండి...మీమ్మల్ని మరచిపోకుండా గుండెల్లో పెట్టుకుంటా...నన్ను ఎమ్మెల్యేగాను, ఎంపీ అభ్యర్థిగా చంద్రశేఖరరావును గెలిపించండి అంటూ పెడన ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) కోరారు. బుధవారం సాయంత్రం ఆయన పెడన పట్టణంలోని శ్రీగంగా పార్వతీ సమేత ఆగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట విజయీభవ యాత్రను ప్రారంభించారు. 4, 5, 6, 7, 8, 9 వార్డులు మీదుగా ఈ విజయీభవ యాత్ర కొనసాగింది. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరరంజీవి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తుంటే వాటిని అందనీయకుండా టీడీపీ కూటమి పావులు కదుపుతూ కోర్టులకు పోతు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, మాజీ చైర్మన్ ఆనందప్రసాద్, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూటమి నేతల తప్పుడు ప్రచారం నమ్మకండి

- ఎదురుమొండి వంతెన నిర్మాణం జగనన్నకే సాధ్యం
- యువనేత వికాస్



ఎదురుమొండి దీవి ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టో వివరిస్తున్న వికాస్, పార్టీ నాయకులు

ఎదురుమొండి(నాగాయలంక): జగనన్న ప్రభుత్వంలో అన్ని అనుమతులు పూర్తి చేసుకుని, నిధులు సమకూర్చుకుని టెండరు దశలో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న కృష్ణానదిపై ఎదురుమొండి వంతెన పనులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జూన్‌లోనే శ్రీకారం చుడుతుందని పార్టీ నియోజకవర్గం యువనేత, ఎమ్మెల్యే రమేష్ తనయుడు సింహాద్రి వికాస్ స్పష్టం చేశారు. ఎన్నికల హామీలతోనే సరిపుచ్చే, చేతగాని కూటమి నేతల తప్పుడు ప్రచారం నమ్మవద్దన్నారు. బుధవారం నాగాయలంక మండలం ఎదురుమొండి దీవిలోని ఎదురుమొండి, బ్రహ్మయ్యగారిమూల, గొల్లమంద, జింకపాలెం, బొడ్డువారిమూల, కృష్ణాపురం, ఏసుపురం గ్రామాల్లో పార్టీశ్రేణులు, అభిమానులు, కార్యకర్తలతో కలసి వికాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరిగి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి మేనిఫేస్టోను మహిళలకు, వృద్ధులుకు వివరించారు. మే13న జరిగే పోలింగ్‌లో అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి రమేష్ బాబు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడుతూ దీవుల్లో ఆదిపత్యం తమదేనని, కూటమి నేతలు ప్రజల్లో అలజడి సృష్టించడానికి పనికిమాలిన దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది చిన్నారి, మోకా సుబ్బారావు, మోకా నాగప్రసాద్, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఆకుల బాబీ, తోట సాయిబాబు, మండల పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

గణపేశ్వరం(నాగాయలంక): పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ పలు గ్రామాల్లో టీడీపీ–జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఝలక్ మీద ఝలక్ ఇస్తున్నారు. మండలంలోని గణపేశ్వరం శివారు దిండి గ్రామానికి చెందిన 30 బీసీ కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు మంగళవారం రాత్రి ఆ పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు పర్యవేక్షణలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భోగాది శేషగిరి రావు ఆధ్వర్యంలో వారికి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దిండికి చెందిన పదో వార్డు సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, జన్ను రాజారావు, బెల్లంకొండ కోటేశ్వరరావు, వసంతరావు, వంశీ, రామస్వామి, పరిశె సోమేశ్వరరావు, భిక్షం, గంగయ్య, సంపాన శేషగిరి, కారంకి వెంకటేశ్వరరావు, మోర్ల గాంధీ, దీవు వీరాస్వామి, ఎర్రగళ్ల గోపి తదితరులు పార్టీలో చేరారు. పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పరిపాలన నచ్చి మళ్లీ ఆయనే అధికారంలోకి రావలనే సంకల్పంతో పార్టీలో చేరినట్లు, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు గెలుపునకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. టీడీపీ, జనసేనలను కాదని వైఎస్సార్ సీపీలో చేరికల పరంపర కొనసాగడంతో కూటమి వర్గాల్లో ఓటమి భయం వెంటాడుతుందని పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు చెప్పారు. సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చెన్ను రంగారావు, మోకా నాగేంద్రప్రసాద్, తోట సాయిబాబు, బుడిపల్లి బసవయ్య, భీమా బాబూరావు బంద్రెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కృత్తివెన్ను: కృత్తివెన్ను పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల పరిధిలోని కృత్తివెన్ను పంచాయతీ గుడిదెబ్బకు చెందిన బస్వాని నీలాజలం కృత్తివెన్ను గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఆశయాలకు ఆకర్షితులైన ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ వట్టికూటి విశ్వేశ్వరరావు, అలెగ్జాండర్, వెంకటరత్నం, ఆంజనేయులు, రామాచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేయండి

రోడ్‌షోలో పేర్ని కిట్టు



పేర్ని కిట్టు కు సామూహిక విజయ హారతులు ఇస్తున్న మహిళలు

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటేయాలని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కిట్టు బుధవారం నగరంలోని పలు డివిజన్‌లలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టుకు 46వ డివిజన్‌లో మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని మూకుమ్మడిగా విజయ హారతులు ఇచ్చి తిలకం దిద్దారు. అభిమానులు, కార్యకర్తలు పేర్ని కిట్టుకు గజపూలమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతి డివిజన్‌లోనూ విజయం నీదేనంటూ దీవించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గత 59 నెలలుగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు నవరత్న పథకాల ద్వారా లక్షలాది రూపాయల సాయం అందించారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన వంటివి పెద్ద ఎత్తున జరిగి పేదల కష్టాలు తీరాయన్నారు. ఇక మచిలీపట్నం విషయానికి వస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంపై అమితమైన ప్రేమను చూపి పోర్టు, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్, ఇండోర్ స్టేడియం వంటి మేజర్ ప్రాజెక్టులు మంజూరు చేయగా, పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర గత టీడీపీ పాలనలో ఐదు శాఖలకు మంత్రిగా పని చేసి మచిలీపట్నంకు ఒక్క మంచి ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని విమర్శించారు. మచిలీపట్నానికి మంజూరైన బెల్ కంపెనీ విస్తరణను లోకేష్‌కు బహుమతిగా నిమ్మకూరుకు ఇచ్చి ఈ ప్రాంత ప్రజలకు కొల్లు రవీంద్ర ద్రోహం చేశాడన్నారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే పోర్టు పనులను ప్రారంభిస్తామని చెప్పటంతో సెంటిమెంట్‌తో రవీంద్రకు ఓట్లేసి గెలిపిస్తే 2019 ఎన్నికల ముందు పోర్టు నిర్మిస్తామంటూ రూ.8.60 కోట్లు ఖర్చు చేసి మరో సారి ఓట్లు దండుకునే ప్రయత్నం చేయగా ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పుడు కూడా అమలు సాధ్యం కాని హామీలతో కొల్లు రవీంద్ర ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి చెప్పిన మాటపై నిలబడి పని చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పేర్ని కిట్టు కోరారు. ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్‌షో వెంట భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

నేడు గంగాభవానీ అమ్మవారి నెల సంబరం

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారి నెల సంబరాన్ని గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు బుధవారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తై నెల రోజుల గడిచిన సందర్భంగా అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం నెల జాతరను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం గణపతి పూజ, మండపారాధన, అఖండస్థాపన, కుంకుమ పూజ కార్యక్రమాలను జరపనున్నట్లు యుగంధరరావు తెలిపారు. అనంతరం పోతురాజు సంబరం, మహిళలచే చద్ది నైవేధ్యాల సమర్పణ ఉంటుందన్నారు. రాత్రి ఆలయ గుడి సంబరాన్ని నిర్వహించనున్నట్లు యుగంధరరావు చెప్పారు. జాతరను పురస్కరించుకొని ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా క్యూలైన్లు, టెంట్లను ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని గణపేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలో గణపేశ్వరం, పర్రచివర, టి.కొత్తపాలెం, పెదపాలెం, దిండి, పెదగొడపాలెం, సొర్లగొంది, బర్రంకుల తదితర గ్రామాల్లో గురువారం కరెంటు ఉండదని మండల విద్యుత్ శాఖ ఏఈ జి.ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మేనిఫెస్టో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి రమేష్‌బాబు

మర్రిపాలెం(నాగాయలంక): మేనిఫెస్టో ఖచ్చితంగా అమలు చేసి చూపించిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక్కరికే దక్కిందని అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి రమేష్‌బాబు పేర్కొన్నారు. నాగాయలంక సమీపంలోని మర్రిపాలెంలో మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలతో కలసి బుధవారం సాయంత్రం రమేష్‌బాబు విస్తృత ఎన్నికల ప్రచారం చేశారు. గడప గడపకు వెళ్లి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధితో కూడిన నవ్య మేనిఫేస్టోను వృద్ధులు, మహిళలకు వివరించారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీని గెలిపించాలనే కృత నిచ్ఛయంతో ఉన్నారని, ఇక ఎలాంటి సందేహాలకు తావులేదని, తాయిలాలు ఆశించకుండా జగన్ మోహన్ రెడ్డిని గద్దెనెక్కించే దీక్షతో ఉన్నారని చెప్పారు. మే13న జరిగే పోలింగ్‌లో అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థిగా తనను, బందరు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కాపు కార్పొరేషన్ డైరక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదల సంక్షేమ పాలన

మోపిదేవివార్పు(మోపిదేవి): పేదవర్గాలకు సంక్షేమ పాలన అందించిన జగనన్నను మరోమారు గెలిపించుకుందామని మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు అన్నారు. మోపిదేవివార్పు వద్ద ఇంటింటా ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఇంటింటా తిరిగి జగనన్న అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి కూటమికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, కారుమూరి శివనాగరాజు, రాజులపాటి నాగేశ్వరావు, మోర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదర్శ పోలింగ్ స్టేషన్ ప్రారంభం



ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఈఆర్వో వెంకటరమణ

పెడన: పెడన నియోజకవర్గంలోని మడక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడంతో ఈ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ ప్రారంభించారు. ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, దివ్యాంగులకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు, పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్ల సౌకర్యార్థం తీసుకున్న చర్యలు తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో వెంకటరమణ మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో రెండు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో మడక ఒకటి ప్రారంభించామన్నారు. రెండోది పెడన పట్టణంలోని ఎంపీపీ స్కూలు (బంగ్లాస్కూలు)లోని 117వ బూత్‌ను ఆదర్శ పోలింగ్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటు వినియోగించుకున్న 66 మంది ఉద్యోగులు

నేడు పోలీసులకు మాత్రమే అవకాశం

పెడన: పెడన నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా గత ఐదు రోజులుగా ప్రభుత్వ ఉద్యోగులు 1,327 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి వెంకటరమణ తెలిపారు. మండలంలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలోని ఫెసిలిటేషన్ సెంటరులో మెడికల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారితో పాటు ఇతర విభాగాలకు చెందిన వారు ఈ ఐదు రోజులు పాటు ఇప్పటి వరకు మొత్తం 1,327 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మొదటి రోజు 4వతేదీన పీవోలు, ఏపీవోలు 212 మంది, రెండో రోజు 5వ తేదీన ఓపీవోలు 600 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారన్నారు. 6వ తేదీన మూడో రోజు పోలీస్, మెడికల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఇతర శాఖలకు చెందిన 316 మంది వేశారని తెలిపారు. 7వ తేదీన నాలుగో రోజున 133 మంది, ఐదో రోజు 8వ తేదీన 66 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. 9వ తేదీన కేవలం పోలీస్‌శాఖకు సంబంధించిన వారికి మాత్రమే ఈఆర్వో కార్యాలయంలోని ప్రత్యేక కౌంటరు ద్వారా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించడానికి వెళ్లిన నేపథ్యంలో వీరికి ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్‌కు ఆఖరి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే వీరికి అవకాశం ఉందని, ఆ తరువాత లేదని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం విస్తృతం



పిట్టల్లంక ప్రచారంలో పార్టీ నేతలు, కార్యకర్తలు

కోడూరు: వైఎస్సార్ సీపీ మండల శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని జయపురం, పిట్టల్లంక, పాదాలవారిపాలెం గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబును, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజవర్గాన్ని అభివృద్ధి చేసి, ఇచ్చిన హామీలను నేరవేర్చిన రమేష్‌బాబుకు ప్రజలకు అండగా నిలవాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిని పటిష్టంగా నిర్మిస్తున్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి 22ఏ నిషేధిత సమస్యను పరిష్కరించినట్లు నేతలు చెప్పారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, దాసరి వెంకటేశ్వరరావు, అద్దంకి శివప్రసాద్, నేతలు కోట పద్మావతి వరప్రసాద్, పరిశె భీక్షాలు, ఇంకొల్లు మురళీకృష్ణ, కోట సుబ్రహ్మణ్యం, సంగా గోపి, తదితరులు పాల్గొన్నారు.